# తాండూరును అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతా

తాండూరు, డిసెంబర్ 22: అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి 'ప్రజా భవన్' పేరు పెట్టి ఘనంగా ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, అభిమానులు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నూ ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తామని, అందరి ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజలనూ కలుపుకొని పయనిస్తామన్నారు. తమ గెలుపుతో పాటు పార్టీ పటిష్టతకోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ సరైన అవకాశాలు కల్పిస్తామన్నారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు జరిగినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉద్యోగులు బాధ్యతతో విధిగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల్లో నిర్లక్ష్యం ఉంటే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నేతలు ప్రజలు ఉన్నారు.

**ప్రజా భవన్ ప్రారంభోత్సవంలో
ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి**



ప్రజాభవన్ ప్రారంభోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దంపతులు

## వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బొంరాస్‌పేట, డిసెంబర్ 22 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం శారద హాస్పిటల్, నిర్మాణ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరంలో జనరల్ సర్జరీ, పిడియాట్రిక్స్, సర్జికల్ అంకాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, డెంటల్, గైనకాలజీ, యూరాలజీ, సైక్రియాటివ్ విభాగాలకు సంబంధించి సమస్యలతో బాధపడే వారికి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమున్న వారిని ఇతర దవాఖానలకు రిఫర్ చేశారు. సుమారు 485 మంది రోగులకు వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమంత్ కుమార్, వైద్యులు అరుణ్‌రాటి, రామచంద్ర, రాజేశ్, పూర్ణానంద్, సందీప్, పూజ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ అపర్ణ, ఉపాధ్యాయులు

వికారాబాద్, డిసెంబర్ 22 : గణితాన్ని కష్టమైన సబ్జెక్టుగా భావించకుండా ఇష్టంతో చదువాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ అన్నారు. శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని వికారాబాద్ కొత్తగడి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠ శాలలో విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. దీపశ్రీ ఇచ్చిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన, ఐశ్వర్య గ్రూప్ గణిత గుర్తులతో వినూత్నంగా చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు గణితంలో వచ్చిన పరిణామ క్రమాన్ని దశల వారీగా వివరిస్తూ విద్యార్థులు ఇచ్చిన ఉపన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీనిలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలు విద్యార్థుల సృజనాత్మక శక్తికి తార్కాణంగా నిలిచాయి. వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, స్రవంతి, తేజస్వి, సల్మా, కవిత పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట:** ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. రామానుజం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

పూడూరు, డిసెంబర్ 22: మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన చెంచుపల్లి లో హనుమాన్ మందిరం వద్ద శుక్రవారం ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. అలాగే పోచమ్మ దేవాలయంలో విగ్రహం, బొడ్రాయి, నాగదేవత, శివలింగాల ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమాల్లో ఎన్కెపల్లి సర్పంచ్ వనజ, ఎంపీటీసీ సురేందర్ గ్రామ పెద్దలు, యువకులు, దాతలు పాల్గొన్నారు.

### వరికి మద్దతు ధర కల్పించాలని రైతుల ఆందోళన

పరిగి టౌన్, డిసెంబర్ 22 : వరికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పరిగి వ్యవసాయ మార్కెట్‌కు వరి ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులు ఆందోళనకు దిగారు. గత వారం క్వింటాళ్లుకు రూ.3450 ఉంటే ఈ వారం రూ.2950 ధర నిర్ణయించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని పరిగి మండల పరిధిలోని లఖ్నాపూర్ గ్రామానికి చెందిన రైతులతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఆందోళన చేపట్టారు. అధికారులను అడిగితే ఆన్‌లైన్ ప్రకారం నిర్ణయించిన ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని లఖ్నాపూర్ గ్రామానికి చెందిన రైతు సురేశ్ చెప్పారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి న్యాయం చేయాలని పలు గ్రామాల రైతులు కోరారు.

### ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రాం పై అవగాహన

మోమిన్‌పేట, డిసెంబర్ 22 : మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ హై స్కూల్‌లో శిక్షణా ఫౌండేషన్, ది హన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ వారి ఆర్థిక సహకారంతో మండల ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రేరణ ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రాంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ సీనియర్ మెంటార్ రాములు, మండల ఎమ్మార్పీలు దేవ్యా నాయక్, రాములు, ఆర్పీలు, శిక్షణ ఫౌండేషన్ మెంటార్స్ లక్ష్మీనారాయణ, ప్రియాంక, రమేశ్ పాల్గొన్నారు

## దివ్యాంగులకు సర్కార్ చేయూత



దివ్యాంగుడికి పరికరం అందజేస్తున్న భీమ్‌భరత్

నవాబుపేట, డిసెంబర్ 22: దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత నిస్తుందని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు భీమ్‌భరత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దివ్యాంగుల సంఘం కార్యాలయం వద్ద లయన్స్‌క్లబ్ వారి సహకారంతో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంక టయ్యా, కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకట్‌రెడ్డి, ఎక్బాల్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు, దివ్యాంగుల సంఘం నవాబుపేట మండల ఉపాధ్యక్షుడు శంకరయ్య, మాణిక్యం, బాల్‌రాజ్, మంజుల, గోవింద్ పాల్గొన్నారు.

### ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

బొంరాస్‌పేట, డిసెంబర్ 22 : దివ్యాంగులకు ఉచితంగా నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొంరాస్‌పేట ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం హరిలాల్ కోరారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహించారు. ఫిజియోథెరపిస్టు మల్లేశం దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన జీహెచ్‌ఎం మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారులకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ నిర్వహిస్తే వారు అంగవైకల్యం నుంచి కోలుకుని సకలాంగులతో సమానంగా పనులు చేసుకుంటారని, తల్లిదండ్రులు ఇంటి వద్ద కూడా ఫిజియోథెరపీ చేయాలని సూచించారు.

### విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ

బొంరాస్‌పేట, డిసెంబర్ 22 : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా కోస్గి పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అచ్చుగట్ల లక్ష్మణమూర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. బుర్రితండా, లోతుకుంట తండా, భోజన్నగడ్డ తండాల్లోని పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు రూ.9 వేల విలువ చేసే నోట్‌బుక్కులు, పెన్నులు, పలకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శశిధర్, జ్యోతి, దమయంతి, విజయ పాల్గొన్నారు.

### పెండ్లికి పుస్తెమెట్టెలు అందజేత

దోమ, డిసెంబర్ 22: మండల పరిధిలోని బట్లచందారం గ్రామానికి చెందిన నిమ్మలి లక్ష్మయ్య, వెంకటమ్మల కుమార్తె సబిత పెండ్లి సందర్భంగా ఆమె తల్లిదండ్రులకు సర్పంచ్ వార్ల రాములు పుస్తెమెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత స్థానిక ఎన్నికల సందర్భంగా గ్రామంలో జరిగే ప్రతి ఆడపడుచు పెండ్లికి పుస్తెమెట్టెలు అందజేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మర్పల్లి, డిసెంబర్ 22: మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామానికి చెందిన కోకపేట అంతమ్మ శుక్రవారం ఉదయం మృతి చెందింది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న జడ్పీటీసీ మధుకర్ అంత్యక్రియల కోసం రూ.ఐదు వేలు పంపించగా బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మధుకర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు.. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, యాదగిరి, మల్లేశం, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దంపతులను బెదిరించి డబ్బు, బంగారం చోరీ

మోమిన్‌పేట, డిసెంబర్ 22 : బైక్ పై వెళ్తున్న భార్య భర్తలను బెదిరించి నగదు, బంగారం అపహరించిన ఘటన మోమిన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మోమిన్‌పేట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మోమిన్‌పేట మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన బండ గురుమూర్తిరెడ్డి వ్యవసాయదారుడు. గురువారం సాయంత్రం రొంపల్లిలోని బంధువుల ఇంటి నుంచి భార్యతో కలిసి స్వగ్రామానికి బయలు దేరారు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను ఫాలో చేశారు. మోమిన్‌పేట మండలం ఇజ్రాచిట్టంపల్లి గ్రామ సమీపంలో బైక్‌ను అడ్డగించి పదునైన ఆయుధంతో దుండగులు భార్యాభర్తలను బెదిరించారు. వారి వద్ద ఉన్న నగదు, మూడు తులాల పుస్తెల తాడు, ఉంగరం తీసుకొని పారిపోయారు. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ప్రభుత్వ భూములను గుర్తిస్తున్న అధికారులు

బొంరాస్‌పేట, డిసెంబర్ 22 : మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, గ్రామకంఠం భూములను అధికారులు గుర్తిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ వెంకటేశ్, సర్వేయర్ దేవేందర్ శుక్రవారం బొంరాస్‌పేట, మెట్లకుంట గ్రామాల్లో పర్యటించి పలు గ్రామకంఠం ప్రభుత్వ భూములను పరిశీలించారు. బొంరాస్‌పేటలో శిథిలమై కూలిపోయిన నీటిపారుదల శాఖ అతిథి గృహం స్థలాన్ని, అటవీశాఖ స్థలాన్ని పరిశీలించారు. భవిష్యత్తులో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వ భూములు అవసరమైతే ముందుగానే గుర్తించాలని నిర్ణయించినట్లు సమాచారం. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్డ్, గ్రామకంఠం భూములను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు.

### ఆత్మరక్షణకు కరాటే దోహదం

తాండూరు, డిసెంబర్ 22: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణ కేంద్రం తులసీ గార్డెన్‌లో స్కూల్ గేమ్ పెడరేషన్(ఎస్‌జీఎఫ్) వికారాబాద్ జిల్లా ఆర్గనైజేషన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో టోర్నమెంట్ చాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, మాజీ డీసీసీ సభ్యులు పట్లోళ్ల నర్సింహులు, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, నాయకులు సాయిపూర్ బాల్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.